క్లుప్తంగా

పరామర్శ



మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన ఓదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీశ్, మాజీ ఎంపీటీసీ రావుల కల్పన మొగిలి, గ్రామశాఖ అధ్యక్షుడు అన్నమనేని మధుసూదన్‌రావు, నాయకులు నారమల్ల నవీన్, బాపు, వినయ్, సందీప్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల గుర్తింపు



పలిమెల: మహాత్మాగాంధీ ఉపాధిహామీ పనుల గుర్తింపునకు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనంలో గురువారం గ్రామ సభ నిర్వహించినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ గ్రామ సభలో ఈజీఎస్ ప్రణాళిక ప్రక్రియలో భాగంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి పనులను గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, ఏపీఓ సునీత, ఈసీ శ్రీకాంత్, టీఏ సాంబ, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కాళేశ్వరం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అంబట్‌పల్లి వైద్యాధికారి డాక్టర్ జగదీశ్ కన్నా సూచించారు. గురువారం మండల పరిధిలోని రాపల్లికోట గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ మాషుక్ అలీ,హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నర్సయ్య అధ్యక్షతన తల్లిదండ్రులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ వెంకన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి నెలలో ప్రాక్టికల్స్, మార్చి నెలలో థియరీ ఎగ్జామ్స్ ఉన్నందున విద్యార్థులందరూ రెగ్యులర్‌గా కళాశాలకు వచ్చి చక్కగా చదువుకోవాలన్నారు. పరీక్షలు అన్నిటికీ హాజరై మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

ములుగు: జిల్లా కేంద్రం ప్రేమ్‌నగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అడ్మిషన్ పొందడానికి ఈ నెల 30లోపు దరఖస్తు చేసుకోవాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌లాల్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. డిప్లమా ఇన్‌మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (డీఎంఎల్‌టీ), డిప్లమా ఇన్ మెడికల్ సర్టిలైజేషన్ మెనేజ్మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్(డీఎంఎస్టీ) పారామెడికల్ కోర్సులో ఒక్కో గ్రూప్‌లో 30 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 70139 52246 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ బస్సులో వ్యక్తి మృతి

ములుగు రూరల్: హనుమకొండకు చికిత్స కోసం వెళ్లి తిరిగి వస్తున్న వ్యక్తి ఆర్టీసీ బస్సులో మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం ములుగు జిల్లా సర్వాపూర్ గ్రామానికి చెందిన బండి సాంబయ్య(50) కిడ్నీ సమస్య కారణంగా రెండు నెలలుగా హనుమకొండకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. బుధవారం ఉదయం హనుమకొండకు వెళ్లిన అతను తిరిగి ఆర్టీసీ బస్సులో వస్తున్న క్రమంలో ఆత్మకూర్ మండలం గుడెప్పాడ్ వద్దకు చేరుకోగానే అస్వస్థకు గురై మృతి చెందాడు. గమనించిన తోటి ప్రయాణికులు కండక్టర్, డ్రైవర్‌కు తెలుపగా వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకొని మృతుడి వద్ద ఉన్న ఆధారాల మేరకు కుటుంబ సభ్యులకు తెలియజేసి.. ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించి పంపించారు. మృతుడి కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లి గురువారం దహనసంస్కారాలు నిర్వహించారు.

దయనీయంగా దర్జీల బతుకులు

- రెడీమేడ్ రాకతో గిరాకీ నిల్
- ఉపాధి లేక ఇబ్బందులు

మొగుళ్లపల్లి: టెక్నాలజీ ప్రభావంతో చేతివృత్తులన్నీ మూలనపడ్డాయి. దీంతో చేతివృత్తుల ఆధారంగా జీవనం కొనసాగించిన వారి బతుకులు రోడ్డున పడ్డాయి. అలా ప్రభావితమైన ప్రధాన రంగాల్లో టైలరింగ్ ఒకటి. ఒకప్పుడు టైలరింగ్ వృత్తిలో ఒక వెలుగు వెలిగిన వారు రెడీమేడ్ దుస్తుల కారణంగా ఇప్పుడు దుర్భర జీవితం గడుపుతున్నారు. రెడీమేడ్ ఫ్యాషన్ దుస్తులొచ్చి మేరోళ్ల చేతిల కత్తెరలన్నీ మూలకోయి, సిలుమెక్కిపోయాయి. కుట్టుమిషన్ల సప్పుడు ఆగిపోయింది. ప్రస్తుతం పూట గడవక.. వేరే పని చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 30వరకు టైలరింగ్ షాపులున్నాయి. రెడీమేడ్ దుకాణాలు ఉన్నప్పటికీ పండుగ సీజన్‌లో గతంలో వారికి కొద్దో గొప్పో



దుస్తులు కుడుతున్న దర్జీ

వ్యాపారం సాగేది. కాని ప్రస్తుతం ఏమాత్రం వారికి గిరాకీ లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అన్ని రకాల వారికి సదుపాయాలు కల్పిస్తున్నా తమలాంటి వారికి కల్పించడం లేదని దర్జీలు వాపోతున్నారు. ప్రతి ఏడాది దసరా, ఉగాది, పండుగలకు గిరాకీ లేకుండా పోవడంతో తాము కుటుంబాలను పోషించుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోని ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రస్తుతం ఎలాంటి పని లేక ఇబ్బందులు పడుతున్నాం. రెడీమేడ్ దుస్తులు మార్కెట్లోకి రావడంతో గిరాకీ లేక మా కుటుంబాలు వీధిన పడే దుస్థితి నెలకొన్నది. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలందించి దర్జీలను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

- రవి, దర్జీ, మొగుళ్లపల్లి

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



ఇప్పలపల్లిలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ఇప్పలపల్లి, మేదరమెట్ల గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. ఇప్పలపల్లి గ్రామం నుండి పోతుగల్ మీదుగా కొర్కిశాల వరకు, మేదరమెట్ల గ్రామం నుంచి అంకుశాపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

పలిమెల: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సర్వర్ భూ అక్రమణదారులను హెచ్చరించారు. పలిమెల గ్రామ శివారులో పలు ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణం కోసం గ్రామకంఠానికి సంబంధించిన ప్రభుత్వ భూమి విస్తీర్ణం 13.31 గుంటలను కేటాయించారు. ఈ భూమిలో స్థానిక భూ అక్రమణదారులు అక్రమంగా సిమెంట్ పోల్స్, కర్రలు వేసి ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో తహసీల్దార్ సర్వర్ గురువారం పంచాయతీ సిబ్బందితో కలిసి వాటిని తొలగించారు. ఎంతటి వారైనా ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమణకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సిమెంట్‌పోల్స్‌ను తొలగిస్తున్న సిబ్బంది

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి

టేకుమట్ల: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య, జిల్లా అధ్యక్షుడు పుల్ల ప్రేమ్ సాగర్ కోరారు. గురువారం మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు అరకొండ రాజయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. సంఘానికి నియమ నిబంధనలు ఉన్నాయని, వాటికి వ్యతిరేకంగా ఎవరు పని చేసిన తొలగించడం జరుగుతుందని అన్నారు. ఇటీవల నేరేళ్ల రామకృష్ణ సంఘానికి వ్యతిరేకంగా పని చేశాడని, అతడిని సంఘం నుంచి తొలగించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మారెపెల్లి కొమురయ్య, ప్రచార కార్యదర్శి రాజేందర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాము, ఉపాధ్యక్షులు వీరయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో స్పందించారు..

- దారి తప్పిన వ్యక్తి ఆచూకీ కనిపెట్టి తీసుకొచ్చిన పోలీసులు

మల్హర్ : అటవీ ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి తప్పిపోయిన ఓ వ్యక్తి ఆచూకీని పోలీసులు కనిపెట్టి తీసుకొచ్చారు. అనంతరం తన గమ్య స్థానానికి చేర్చారు. కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేశ్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన జస్వ ఈనెల 23వ తేదీన సాయంత్రం గూగుల్ మ్యాప్ ద్వారా మంచిర్యాల జిల్లా నుంచి బైక్‌పై ఖమ్మం జిల్లాకు బయలుదేరాడు. ఈ క్రమంలో మండలంలోని పెద్ద తూండ్ల, కిషన్‌రావుపల్లి అటవీ ప్రాంతంలో అర్ధరాత్రి దారి తప్పాడు. దీనికి తోడు జస్వ బైక్ మరమ్మతుకు గురైంది. దీంతో భయాందోళనకు గురైన జస్వ.. వెంటనే డయల్ 100కు కాల్ చేశాడు. కొయ్యూరు ఎస్సై నరేశ్, పీసీ రమేశ్, టీఎస్ఎస్పీ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో సుమారు 2 గంటలపైగా వెతికి జస్వ ఆచూకీ కనిపెట్టి పీఎస్‌కు తీసుకొవచ్చారు. బైక్‌ను రిపేర్ చేయించిన అనంతరం జస్వను ఖమ్మం పంపించారు. కాగా, సకాలంలో స్పందించి దారి తప్పిన జస్వను ఆచూకీ తెలుసుకున్న కొయ్యూరు ఎస్సై, సిబ్బందికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.



జస్వతో ఎస్సై నరేశ్, సిబ్బంది, గ్రామస్తులు

నాణ్యమైన భోజనం అందించాలి

- టెలికాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన కలెక్టర్



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విధంగా క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేయాలని మండల ప్రత్యేకాధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, పల్లె ప్రకృతి వనాలు, రహదారుల వెంబడి పిచ్చి మొక్కలు తొలగింపు, స్వచ్ఛదనం–పచ్చదనం, మొక్కల సంరక్షణ చర్యలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పరిశీలన తదితర అంశాలపై గురువారం మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం ఫుడ్ విత్ చిల్డ్రన్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేయాలని సూచించారు. ఎక్కడైనా లోపాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. తనిఖీల్లో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే రహదారులు వెంబడి పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రం చేయాలన్నారు. మొక్కల సంరక్షణకు ప్రతి శుక్రవారం నీళ్లు పోసే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

కాటారం: సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామాల్లో నేర నియంత్రించవచ్చని ఎస్సై మ్యాక అభినవ్ అన్నారు. కాటారం మండలం గుమ్మాళ్లపల్లిలో గురువారం సీసీ కెమెరాల నిర్వహణ, ఏర్పాటుపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలు చోటు చేసుకోవని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షించడంతో పాటు నిందితుల గుర్తింపు సులభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భూములకు హద్దులు కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

చిట్యాల: మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్‌లో దళితులకు ఇచ్చిన భూములకు హద్దులు కేటాయించాలని కోరుతూ గురువారం రాంనగర్ కాలనీ దళితులు తహసీల్దార్ హేమకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. 40 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం దళితులకు రెండు ఎకరాల చొప్పున కేటాయించిన ఇంతవరకు హద్దులు కేటాయించక పోవడంతో అనేక అవస్థలు పడుతున్నామని తెలిపారు. రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించే ప్రజావాణిలో కూడా దరఖాస్తు ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, తహసీల్దార్‌లు స్పందించి తమ భూములకు హద్దులు కేటాయించాలని కోరారు. రైతులు ఆరెపల్లి నర్సింహారాములు, శనిగరపు మొగిలి, దాసారపు సాంబయ్య , కట్కూరి కుమార్, ఆరెపల్లి అంకుష్, కట్కూరి నర్సయ్య, ఆరెపల్లి లక్ష్మయ్య, మైదం రాజ్‌కుమార్, వేణు, సమ్మయ్య, గుర్రం తిరుపతి, రమేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మండల కాంగ్రెస్ నాయకులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా అలుబాక గ్రామానికి చెందిన చిన్న బలుసుకు రూ.60 వేల విలువ గల చెక్కును, నేలారిపేట గ్రామానికి చెందిన గుండమల్ల జయరాజుకు రూ.13 వేల విలువ గల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహనరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు బాలసాని వేణు, రమేశ్, పిల్లారిశెట్టి మురళి, గాందర్ల నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న నాయకులు

పాఠశాల తనిఖీ

మంగపేట: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సేఫ్టీ, సెక్యూరిటీ ఈ కార్యక్రమంలో భాగంగా ఎంఈఓ మేనక ఆధ్వర్యంలో గురువారం జీసీడీఓ రమాదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం 06 గంటల వరకు పాఠశాల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్ భవన సేఫ్టీ, కిచెన్ రూమ్, స్టోర్ రూమ్, డైనింగ్‌హాల్, మరుగుదొడ్లను పరిశీలించారు. అలాగే ఆహార నిల్వలు, కూరగాలయను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారంగా నాణ్యమైన బోజనం అందుతుందా లేదా అని చూశారు. ఫిజికల్ సేఫ్టీ, పవర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, హెల్త్ చెకప్ వంటి వాటిపై పరిశీలన చేశారు. కార్యక్రమంలో నాగభూషణం, పాఠశాల స్పెషలాఫీసర్ పి.భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ఘనంగా పోలీస్ అమర వీరుల సంస్మర దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాపురం సీఐ బండారి కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో యువతి యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వాజేడు ఎస్సై రుద్ర హరీశ్, చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ ఉన్నారు.



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న పోలీసులు

సమస్యల గుర్తింపునకు హాస్టల్ నిద్ర

ములుగు రూరల్: మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ఇంచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ విజయ్ భాస్కర్ హాస్టల్ నిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను తెలుసుకునేందుకు అధికారులు హాస్టల్ నిద్ర చేపట్టారు. జాకారం గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఎంపీడీఓ పరిశీలించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. ఇంచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఝాన్సీతో కలిసి తహసీల్దార్ విజయభాస్కర్ విద్యార్థులను అడిగి గురుకుల పాఠశాల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు కలిసి గురుకుల పాఠశాలలో నిద్రించారు.

గోవిందరావుపేట: మండలంలోని ఎస్టీ బాలుర హాస్టల్, చల్వాయి కస్తూరిబా బాలికల హాస్టల్‌లో హాస్టల్ నిద్ర కార్యక్రమంలో అధికారులు గురువారం పాల్గొన్నారు. ఎస్టీ హాస్టల్‌లో తహసీల్దార్ సృజన్ కుమార్ విద్యార్థులకు అందిస్తున్న భోజన వసతిని పరిశీలించారు. హాస్టల్‌లో ఉన్న సమస్యలను వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి పవన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వీరభద్రవరం, పాత్రాపురం, నూగూరు, మరికాల గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం చిన్నారులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు జ్యోతి, సత్యనారాయణ, డీపీఎంఓ మహేందర్ తదితరులు ఉన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నేరాల నియంత్రణ అందరి బాధ్యత

ములుగు రూరల్: గ్రామాల్లో నేరాల నియంత్రణ అందరి బాధ్యత అని ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని జంగాలపల్లి, బంజరుపల్లి గ్రామాల్లో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, విద్యుత్‌శాఖ అధికారులను సమావేశంలో భాగస్వామ్యం చేస్తూ గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎస్సై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమస్యలు ఎదురైతే ప్రజలు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావచ్చని అన్నారు. మధ్యవర్తులను తీసుకురాకూడదని అన్నారు. పౌరుల నేర వృత్తిని తగ్గించేందుకుగాను గ్రామస్తులను భాగస్వామ్యులను చేస్తు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి పోలీసులు తమవంతు తోడ్పాటును అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు

మహాసభను విజయవంతం చేయాలి

రేగొండ: వరంగల్‌లో 26న జరిగే మాదిగల ధర్మ యుద్ధ మహాసభను మాదిగలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ జిల్లా నాయకుడు నోముల శ్రీనివాస్ కోరారు. గురువారం ఎమ్మార్పీస్ మండల ఇన్‌చార్జ్ చిలువేరు సంపత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి దేశంలోనే మొదటిసారి తానే వర్గీకరణ చేస్తానని, అవసరమైతే గతంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌లకు ప్రత్యేక ఆర్డినేన్స్ చేస్తానని చెప్పి రెండు నెలలు గడుస్తున్న కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. వరంగల్‌లో జరిగే మహాసభలో మంద కృష్ణ మాదిగ పాల్గొంటున్నారని, అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మేకల రమేశ్, అంబాల అనిల్, చిలువేరు బిన్ను, అజయ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి చేయూత

ములుగు రూరల్: మండలంలోని జంగాలపల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ నీరటి సమ్మయ్య అనారోగ్యానికి గురై ఇటీవ మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ఆర్టీసి ఉన్నతాధికారులు అండగా నిలిచారు. చికిత్స పొంది చెల్లించిన ఆస్పత్రి బిల్లు నుంచి ఆస్పత్రి యాజమాన్యంతో ఆర్టీసీ అధికారులు మాట్లాడి రూ.43 వేల విలువ గల చెక్కును గురువారం బాధిత కుటుంబానికి ఆర్టీసీ ఈడీ మునిశేఖర్ చేతుల మీదుగా అందజేశారు. వరంగల్ ఆర్ఎం విజయభాను, డీఆర్ఎంలు భాను కిరణ్, మాదవరావు, అకౌంట్ ఆఫీసర్ రవీందర్, వరంగల్–2 డిపో మేనేజర్ జ్యోత్స్న పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఆర్టీసీ అధికారులు